క్లుప్తంగా

బైక్‌పై నుంచి పడి.. వ్యక్తికి తీవ్ర గాయాలు

రుద్రవరం: మండలంలోని నర్సాపురం మెట్ట సమీపంలో గురువారం మోటార్ సైకిల్ మీద నుంచి కింద పడి లోకేష్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అహోబిలంలో కేటరింగ్ నిర్వహిస్తున్న లోకేష్ ఆళ్లగడ్డ నుంచి అహోబిలానికి మోటర్ సైకిల్‌పై వెళ్తుండగా రవి కళాశాల వద్ద మలుపు తిరిగే క్రమంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడ్డాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమినించి క్షత గాత్రున్ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఉపకారవేతనాలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రుద్రవరం: మండలంలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన ఎనిమిది విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర్‌రావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గతేడాది డిసెంబర్‌లో జరిగిన పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన గౌరి,దివ్య, సుచిత్ర.స్పందన,శ్రుతి.చైతన్య, సందీప్,కేశవనాగేంద్రను గురువారం అభినందించారు. ఎంపికైన వారికి ప్రభుత్వం ఏడాదికి రూ.12వేల ప్రకారం నాలుగేళ్లు అందిస్తుందని చెప్పారు.

వేలంలో ఆదాయం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో గురువారం రూముల వేలం పాటలో ఆలయానికి ఆదాయం లభించినట్లు ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు తెలిపారు. రెండు రూములకు వేలం నిర్వహించగా మూడు సంవత్సరాల కంటే ఈ ఏడాది రూ.28,500 ఆదాయం లభించినట్లు చెప్పారు. ఆలయ సూపర్‌వైజర్ నాగప్రసాద్, నాగమణిబాయి, వెంకటరమణాచారి పాల్గొన్నారు.

లోక కల్యాణం కోసం హోమాలు


పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో స్ఫటిక లింగేశ్వర ఆలయంలో గురువారం లోక కల్యాణం కోసం పుష్యమాస పౌర్ణమిని పురస్కరించుకొని హోమాలు నిర్వహించారు. స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, నమకం, చమకం తదితర పూజలు నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం లోక కల్యాణం కోసం హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు యోగానందస్వామి, గాంధీ, అనిల్, రఘునాథరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

శిరివెళ్ల: స్థానిక 7వ వార్డులోని నూరాన్‌పేటలో రూ. 10 లక్షల మండల పరిషత్ నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్డు, మురుగు కాల్వ నిర్మాణ పనులను ఎంపీపీ నాయక్ వసీం గురువారం ప్రారంభించారు. ఉప సర్పంచు ఇంతియాజ్, నాయకులు ముజాఫర్, చంద్ర, ముల్లా అన్వర్ బాషా, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు మహబూబ్ బాషా పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

నంద్యాల(న్యూటౌన్): గతేడాది పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మాజీ రిటైర్డు ప్రొఫెసర్ చంద్రశేఖర్‌నాయర్, పోలా రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఎస్పీజీ హైస్కూల్‌లో హెచ్‌ఎం జీవలత అధ్యక్షతన వెంకట సునీల్‌కు 495 మార్కులు రాగా రూ.10,116, బాలికల విభాగంలో ఎల్.ధరణి 485 మార్కులు రాగా పోలా రామసుబ్బమ్మ రూ.5వేలు, పోలా మహాలక్ష్మి రూ.4వేలు, వేదమణి రూ.1116 అంబ్రీస్‌కు అందజేశారు.

సేవలు అభినందనీయం


దాల్ మిల్ అమీర్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న శారదాబాయి

నంద్యాలటౌన్: హెచ్ఐవీ రోగులకు అందిస్తున్న సేవలను గుర్తించి పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దాల్‌మిల్ అమీర్‌ను జిల్లా ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ యూనిట్ సభ్యులు అభినందించారు. స్థానిక ఆసుపత్రి కాన్ఫరెన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శారదాబాయి మాట్లాడుతూ అమీర్ కొంతకాలంగా హెచ్ఐవీ బాధితులకు మందులు, పౌష్టికాహార కిట్లు, దుస్తులను అందిస్తున్నారని చెప్పారు. అనంతరం ఆయనకు మెమొంటో, ప్రశంసా పత్రం అందజేశారు.

పేదలకు ఇళ్ల స్థలాలు

- శిరివెళ్ల మండలంలో 1,578 మందికి స్థలాలు
- జగనన్న కాలనీల్లో వారికి ఇళ్లు కూడా మంజూరు
- ప్రస్తుతం జోరుగా ఇళ్ల నిర్మాణాలు

పేదల అవసరాలను, వారి బాగోగులను పట్టించుకోకుండా గత ప్రభుత్వంలో తమకు నచ్చినట్లుగా పాలన సాగించడంతో వారి బతుకుల్లో మార్పు ప్రకటనలకే పరిమితమైంది. కనీసం తిండి, గూడు లేక అవస్థలు పడుతున్నా.. కేవలం తమకు కావలసిన వారికి స్థలాలు, ఇళ్లు అందజేసి గొప్పలు చూపారు. ఎట్టకేలకు ప్రజాప్రభుత్వం రావడంతో జగనన్న నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి సహకారం అందించి అండగా నిలిచారు.

గ్రామాల వారీగా జగనన్న కాలనీల్లో స్థలాలు, ఇళ్ల మంజూరు వివరాలు..

గ్రామం	స్థలాలు	ఇళ్లు
శిరివెళ్ల	534 మందికి	534
యర్రగుంట్ల	247	247
గోవిందపల్లె	316	316
బోయలకుంట్ల	151	151
కోటపాడు	75	75
మోత్కలపల్లె	39	39
గంగవరం	81	81
గుండంపాడు	135	135


శిరివెళ్లలో పేదల ఇళ్ల స్థలాల కోసం సేకరించిన ప్రైవేట్ భూమి



శిరివెళ్ల: సొంతింటి కల ఇక అటకెక్కినట్లేనను కుంటున్న సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే కేవలం అర్హతే ప్రామాణికంగా అర్హులను గుర్తించి స్థలాలు పంపిణీ చేసి ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందజేయడంతో ఎంతో మంది సొంతింటి కలను సాకారం చేశారు. గతంలో తమకు ఇళ్లు లేక ఎంతో మంది అద్దె ఇంట్లో ఉండి అద్దెలు చెల్లించకపోయేవారు. మండలంలో మూడేళ్ల కితం ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో 1,578 మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ భూములు లేని గ్రామాలలో లక్షల రూపాయలు వెచ్చించి ప్రైవేట్ భూములను కొనుగోలు చేసింది. శిరివెళ్లలో 543 మందికి ఖాదరబాదలో ఎకరం రూ.16 లక్షలు పెట్టి 17 ఎకరాలను కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలను పంపిణీ చేసింది. వారికి ఇళ్లు కూడా మంజూరయ్యాయి. ప్రస్తుతం నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి.

అర్హులందరికీ స్థలాలు పంపిణీ చేశాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండేళ్ల క్రితం సర్వే చేసి అర్హులను గుర్తించి వారికి ఇంటి స్థలం పంపిణీ చేశాం. గ్రామాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి స్థలాలు అందచేశాం. లేని చోట ప్రైవేట్ భూములను కొని పంపిణీ చేశాం. మండలంలో 1,578 మందికి ఇంటి స్థలం కేటాయించాం. జగనన్న కాలనీ కింద వారికి ఇళ్లు కూడా మంజూరయ్యాయి. ప్రస్తుతం నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. త్వరలో పూర్తవుతాయి.

– షేక్ మొయిద్దీన్, తహసీల్దార్

సెంటున్నర స్థలం ఇచ్చారు



మాకు స్థలం, ఇళ్లు లేదు. అద్దె ఇంటిలో ఉంటున్నాం. టీడీపీ హయాంలో నిర్వహించిన ప్రతి జన్మభూమి సమావేశంలో ఇంటి స్థలం కోసం అర్జీ అందజేశాం. కానీ స్థలం కేటాయించలేదు. జగనన్న వచ్చాక మాకు సెంటున్నర స్థలం ఇవ్వడమే కాకుండా ఇల్లు కూడా మంజూరు చేశారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణం చివరి దశలో ఉంది. గతంలో మాకు స్థలం వస్తుందో రాదోనని దిగులు ఉండేది.ఈ ప్రభుత్వంలో దిగులు పోయి సంతోషంగా ఉంది.

– చాంద్‌బాషా, బోయలకుంట్ల

పేదలకు అండగా ప్రభుత్వం



ఈ ప్రభుత్వం పేదలకు అండగా నిలిచి స్థలాలు, ఇళ్లు మంజూరు చేసింది. ప్రస్తుతం సెంటు స్థలం కొనాలంటే రూ. లక్షకు పైగా వెచ్చించాలి. మాకు పూట గడవడమే గగనమైన పరిస్థితుల్లో స్థలం కొనలేదు. ఈ ప్రభుత్వం ఉచితంగా స్థలం కేటాయించి ఇల్లు కూడా మంజూరు చేసింది. ఇలా అండగా ఉంటే మాకు కొంత కూడబెట్టుబెట్టుకోవడానికి అవకాశం లభిస్తుంది కదా.

– సురేష్‌బాబు, గోవిందపల్లె

నిధుల మంజూరు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, తుడుమలదిన్నె, కొండుపల్లె, ఉయ్యాలవాడ గ్రామ సచివాలయాలకు అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ. కోటి మంజూరు చేసిందని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామ సచివాలయాల్లో ఈ నెల 13 నుంచి 20వ తేదీ వరకు జరిగిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల నుంచి వ్యక్తమైన సమస్యల పరిష్కారంలో భాగంగా నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఆర్.జంబులదిన్నె, తుడుమలదిన్నె, కొండుపల్లె సచివాలయాలకు ఒక్కొక్క సచివాలయానికి రూ. 20 లక్షలు చొప్పున సీసీ రోడ్ల నిర్మాణానికి విడుదలయ్యాయన్నారు. ఉయ్యాలవాడలో బస్టాండు నుంచి కుందూనది వరకు ప్రధాన మురుగు కాలువ నిర్మాణానికి రూ. 20 లక్షలు, ఉపాధి హామీ నిధులు రూ.15 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ. 5 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. త్వరలో నిర్మాణం పనులు ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ స్పష్టం చేశారు.

అధ్యాపకులకు శిక్షణ

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులకు మూడు రోజుల పాటు ఇచ్చిన శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. కళాశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఆన్‌లైన్‌లో అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పార్వతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నంద్యాల టౌన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్జీవో కాలనీ, రామాలయం సమీపంలో నున్న ఆఆ హాస్పిటల్ లో ఊపిరితిత్తుల సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి, చిన్న పిల్లలకు శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యులు రాజ్‌కుమార్, తేజస్వి గురువారం తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాడ వాడలా అభివృద్ధి


39వ వార్డులో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): పట్టణంలో వాడ వాడలా అభివృద్ధి ఊపందుకుందని ఎమ్మెల్యే శిల్పా రవి పేర్కొన్నారు. గురువారం 39, 42వ వార్డుల్లో రూ.62లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాతో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వాడలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీటవేశామన్నారు.ఓల్డ్ టౌన్ రూపు రేఖలను మార్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 42వ వార్డు కౌన్సిలర్ శిరీష,వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపీ నిధులు రూ.42 లక్షలతో జంబులా పరమేశ్వరి ఆలయం నుంచి ఈద్గా వరకు నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే 39వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నిర్మిస్తున్న రోడ్డుకు కౌన్సిలర్ వెంకటలక్ష్మి కోరిక మేరకు అదనంగా రూ.4.80 లక్షలు మంజూరు చేసి పూర్తి చేశామన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దాల్‌మిల్ అమీర్, కౌన్సిలర్లు కృష్ణమోహన్, సాదిక్‌బాషా, నాయకులు దేశం సుధాకర్‌రెడ్డి, జయప్రకాష్, ఆసిఫ్, మధు, రఫీ, నరసింహ, హరినాథ్‌బాబు, ఫైరోజ్, వెంకట్, దాదా కలందర్, నాగరాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


రహదారి శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(అర్బన్): నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి దత్తత గ్రామమైన చాబోలులో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం గ్రామంలో రూ.30 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను ఎంపీ పోచాతో కలిసి ప్రారంభించారు.వారు మాట్లాడుతూ మరో రూ.45 లక్షలతో అభివృద్ధి పనులకు టెండర్ ప్రక్రియ పూర్తియిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద రూ.20 లక్షలు మంజూరయ్యారన్నారు. ఎంపీడీఓ సుగుణ శ్రీ, సర్పంచ్ మౌనిక, ఎంపీటీసి చెన్నయ్య, నాయకులు నాగనంది రెడ్డి, మదార్సా, రాజగోపాల్ రెడ్డి, విశాల్‌రెడ్డి, తిమోతి బాల హుస్సనీ, పాల మాబు, మధుగోపాల్‌రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికే ఆసరా

- నంద్యాల నియోజకవర్గానికి రూ.112 కోట్లు మంజూరు
- 4వ విడత ఆసరా మంజూరుతో అక్కాచెల్లెమ్మల హర్షం
- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి


డ్వాక్రా మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, పీపీ నాగిరెడ్డి

నంద్యాల(సిటీ): మహిళల ఆర్థిక స్వావలంబన కోసమే సీఎం జగనన్న సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్‌లో నంద్యాల టౌన్, నంద్యాల మండలాలకు సంబంధించి వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాలు నిర్వహించి మెగా చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగు విడతల్లో నంద్యాల నియోజకవర్గానికి సుమారుగా రూ.112 కోట్లు అక్కా చెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశారని చెప్పారు. నాలుగవ విడతలో పట్టణంలోని 2,452 గ్రూపులకు రూ.15.37కోట్లు, నంద్యాల మండంలోని 1,193 గ్రూపులకు రూ.8.31కోట్లు మంజూరు చేశారన్నారు. పేదలందరికీ మంచి చేస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ అక్కా చెల్లెమ్మలకు జగనన్న ప్రభుత్వం బాసటగా నిలుస్తుందన్నారు. అనంతరం మహిళలు కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మెప్మా పీడీ శివనాగలీల, మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, కమిషనర్ రవిచంద్రారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వర రెడ్డి ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, దృశ్యకళల డైరెక్టర్ సునీతాఅమృతరాజ్, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, ఎంపీడీఓ సుగుణశ్రీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన మహిళలు

జగనన్న ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



నేను శ్రీలక్ష్మీసాయి గ్రూపు, నూనెపల్లెలో నివాసం ఉంటున్నా. డ్వాక్రా రుణాలు తీసుకున్న మాకు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పసుపు కుంకుమ పేరుతో ఎన్నికల సమయంలో మోసం చేశారు. అప్పుడు మాకు ఒక్క రూపాయి కూడా రాలేదు. అందుకు భిన్నంగా నేడు జగనన్న నాలుగు విడతల్లో మా గ్రూపునకు రూ.1.59 లక్షలకు పైగా రుణం మాఫీ చేశారు. సీఎంకు రుణపడి ఉంటాం.

– హిమజ,నూనెపల్లె,నంద్యాల

గత ప్రభుత్వంలో మోసపోయాం



పట్టణంలోని క్రాంతి నగర్‌లో నివాసం ఉంటున్నాం. పది సంవత్సరాలుగా భార్గవి పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్నా. గత ప్రభుత్వంలో సున్నా వడ్డీ రుణాలు అందలేదు. జగనన్న ఇచ్చిన ఆసరా ద్వారా మా గ్రూప్‌నకు నాలుగు విడతల్లో రూ.2.46లక్షల రుణమాఫీ అయ్యింది. ఈ సొమ్ము చిరువ్యాపారాలు చేయడానికి ఆసరాగా ఉంటుంది.

– లక్ష్మీప్రసన్న,క్రాంతినగర్, నంద్యాల

ఆధునిక క్యాన్సర్ చికిత్సపై సదస్సు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ రవికృష్ణ

నంద్యాల టౌన్ : క్యాన్సర్ లాంటి ప్రాణాంతకమైన జబ్బులకు సంబంధించి ఆధునిక చికిత్స విధానాలపై వైద్యులు అవగాహన కలిగి ఉండాలని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుల ఫోరం చైర్మన్ డాక్టర్ రవికృష్ణ తెలిపారు. గురువారం పట్టణం లోని ఉదయానంద కార్కినోస్ క్యాన్సర్ హాస్పిటల్‌లో కాన్సర్ జబ్బులు – ఆధునిక చికిత్సలు అనే అంశంపై వైద్యులకు సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాలలోనే క్యాన్సర్‌కు చికిత్స అందించే ఆసుపత్రిని ఏర్పాటు చేయటం సంతోషకరమన్నారు. వైద్యులు భార్గవ, సాయి ప్రణీత్ మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్స విధానాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య శ్రీ ద్వారా క్యాన్సర్ చికిత్సలు కూడా చేస్తున్నామన్నారు. తిరుపతి బర్డ్స్ హార్ట్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, వైద్యులు, పనీల్, మధుసూదన్ రావు, సహదేవుడు, విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైలంలో ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో లోకకల్యాణం కోసం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు చేపట్టారు. గురువారం శ్రీస్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించి, మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు.

ఊయలసేవ

శ్రీశైల భ్రమరాంబాదేవికి పౌర్ణమిని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయల సేవ నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.


పల్లకోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు : లోక కల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.


ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయస్వామికి

ఓటు.. సామాన్యుడి బ్రహ్మాస్త్రం

ఆళ్లగడ్డ : ప్రజాస్వామ్యంలో సామాన్యుడి చేతిలో ఉన్న ఒకే ఒక్క బ్రహ్మాస్త్రం ఓటు అని ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నంద్యాల ఆర్‌డీఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండటం బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. అనంతరం ఉత్తమ బీఎల్‌ఓలకు బహుమతలు అందజేసి అభినందించి ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు స్థానిక వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ హరినాథరావు, ఎస్ఐ వెంకటరెడ్డి, ఎంపీడీఓ మహబూబ్ ఖాన్, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, ఎన్నికల ఉప తహసీల్దార్ శేఖర్, ఎంఈఓ శోభావివేకవతి ఉన్నారు.

చాగలమర్రి: 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్ సుభద్రమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక నారాయణపల్లె రస్తాలోనున్న ఎస్వీ జూనియర్ కళాశాల నుంచి విద్యార్థులతో పెద్దమకానం మీదుగా గాంధీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. డీటీలు విజయ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : ఓటు భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని యువత వదులుకోవద్దని, సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. మండలంలో మొత్తం 22,678 ఓటర్లు ఉన్నారని వారిలో పురుషులు 11,207, మహిళలు 11,469, ట్రాన్స్‌జండర్లు 2 ఉన్నారని వివరించారు. డిప్యూటీ తహసీల్దార్ తులసీకృష్ణ, ఆర్ఐ సత్తార్, సీనియర్ అసిస్టెంటు అంకన్న, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): ప్రతి విద్యార్థి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.ముఖ్యఅతిథిగా హాజరైన డీఎఫ్‌ఓ అనురాగ్‌మీనా మాట్లాడుతూ 70శాతం ఓటర్లలో గతంతో పోలిస్తే ఈ సారి 70శాతం ఓటు హక్కు పట్ల యువతీ యువకుల్లో ఉత్తేజం పెరిగిందన్నారు. కళాశాల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్బయ్య, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రమణమ్మ, శ్రావణికుమారి పాల్గొన్నారు.

దొర్నిపాడు: రానున్న ఎన్నికల్లో మన ఓటు అభివృద్ధికి చోటు కావాలని తహసీల్దార్ జయప్రసాద్ సూచించారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురష్కరించుకొని స్థానిక తహసీల్దార్ కార్యలయంలో బీఎల్‌ఓలతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ చిన్నగోవిందు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.


ఆళ్లగడ్డలో ఉత్తమ బీఎల్వోకు బహుమతి అందజేస్తున్న ఆర్డీ ఓ శ్రీనివాస్


చాగలమర్రి గాంధీ సెంటర్‌లో విద్యార్థుల మానవహారం

ఆర్థిక సాయం

చాగలమర్రి: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి పి.పండు జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. పోటీలు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని కోర్బా పట్టణంలో ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. పోటీల్లో పాల్గొనే క్రీడాకారుడికి పీఆర్‌టీయూ మండల శాఖ తరపున హెచ్‌ఎం ఎం.కోటయ్య రూ.4వే నగదు గురువారం అందజేశారు. సభ్యులు నారాయణ మూర్తి, రవీంద్రారెడ్డి, సహదేవారెడ్డి, మాబుబాషా, హరిహరనాథ్‌రెడ్డి, పీడీ దాదాపీర్, పీఈటి భారతీ పాల్గొన్నారు.

టీ దుకాణంలో చోరీ

చాగలమర్రి: మండల కేంద్రం సమీపంలోని ఎస్‌ఆర్ కల్యాణ మండపం ఎదురుగానున్న మహబూబ్ బాషా టీ దుకాణంలో గుర్తు తెలియని దుండగులు గురువారం తెల్లవారు జామున చోరీకి పాల్పడ్డారు. తాళాలు పగులగొట్టి దుకాణంలోని రూ.5వేల నగదుతో పాటు మరో రూ.3వేల విలువ చేసే సిగరేట్ ప్యాకెట్లను దోచుకెళ్లారని బాధితుడు వాపోయాడు. అలాగే సమీపంలో ఉన్న గ్రామ దేవత చాగలమ్మ గుడిలో గంటను అపహరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.